వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 14 జూన్ 2025

## పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**బద్వేలు, జూన్ 13 (ప్రభాతవార్త):**
పట్టణంలోని అర్బన్ మరియు రూరల్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకాశమగంగా తనిఖీ చేశారు.. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అలాగే అర్బన్ సీఐ రాజగోపాల్, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, ఎస్ఐలు సత్యనారాయణ,జయరామి రెడ్డిలకు పలు సూచనలు ఇచ్చారు. అలాగే ఎవరైనా నకిలీ పట్టాలు సృష్టిస్తే వారి పై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టిసారించి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే బద్వేలులో నకిలీ పట్టాల వ్యవహారంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఎవరైనా నకిలీ పత్రాలతో పోలీసుస్టేషన్ కు వస్తే వెంటనే కేసు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఫిర్యాదుదారులను గౌరవించి వీ లైనంత త్వరగా ఫిర్యాది సమస్యను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా శాంతి భద్రతలపై చర్యలు చేపట్టి ప్రజలకు ఏలాంటి ఇబ్బందు కాలు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాత్రివేళలో గస్తీ ముమ్మరం చేసి చోరీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు

## డిజిపిని కలిసిన అన్నమయ్య ఎస్పీ విద్యాసాగర్

**రాజంపేట జూన్ 13 ప్రభాతవార్త**
రాష్ట్ర డిజిపి శ్రీ.హరీష్ కుమార్ గుప్తా ను అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీగా పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా హరీష్ కుమార్ గుప్తాను అన్నమయ్య జిల్లా ఎస్పీ కలిశారు. డిజిపి కి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



# తల్లికి 'కూటమి' వందనం

### సూపర్ సిక్స్‌లో బాబు కీలక హామి సక్సెస్

### తల్లిదండ్రులపై కూటమి చెరగని ముద్ర

### రాయలసీమలోనే అత్యధికంగా 19,63,396 మందకి లబ్ది

**రాజంపేట, జూన్ 13, ప్రభాతవార్త:**
తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన కొన్ని హామీలు నెరవేర లేదు. 2019-24లో కొలువు తీరిన జగన్ సర్కార్ బటన్ నొక్కే కార్యక్రమంతో సగటు కుటుంబాలపై చెరగని ముద్ర వేసింది. ఎంత అంటే జగన్ మాకు ఎదో ఒక రూపంలో మా కుటుంబానికి లబ్ది చేకూర్చుతున్నారు కదా అనే వరకు వెళ్లింది. దీన్నుంచి ఓటరును చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలపై ప్రజలు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే కూటమి నేతగా, ముఖ్యమంత్రిగా చంద్రబాబు సూపర్ సిక్స్‌లో మొదటి పథకం పింఛన్ రూ.4వేలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆ తర్వాత ఇచ్చిన హామీల్లో జగన్‌కు ఎంతో ఓట్ బ్యాంకుగా మారిన అమ్మఒడి స్థానంలో చంద్రబాబు ప్రకటించిన తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికి 15వేలు ఇస్తామని ప్రకటించి సంచలనం సృష్టించారు. అయితే జగన్ కుటుంబంలో ఒక్కరికి అమ్మఒడి ఇచ్చి చేతులు ఎత్తేశారు. కానీ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై కూడ తల్లిదండ్రుల్లో ఏదో ఒక మూల అనుమానం ఉండేది. ఇంట్లో అందరికి తల్లికి వందనం ఇస్తారా? ఈ పథకం అమలు చేయడం సాధ్యమా అన్న అనుమానాలు లేకపోలేదు. జూన్ 12న పాఠశాలలు తెరచిన రోజే తల్లికి వందనం ద్వారా తల్లుల ఖాతాల్లో రూ.15వేలు జమ చేస్తామని ప్రభుత్వం విధాన ప్రకటన చేసింది. అయితే గురువారం పథకం అమలులో ఒకటి, రెండు సాంకేతిక అవరోధాలతో వాయిదా పడింది. దీంతో సర్వత్రా తల్లికి వందనం వచ్చే నెలలో ఇస్తారనే ప్రచారం జరిగింది. 12వ తేది నిధులు జమ కాకపోవడంతో ఒకింత అనుమానం వచ్చింది. అయితే కూటమి సర్కార్ ఇచ్చిన హామీని మాట తప్పకుండా మడమ తిప్పకుండా అమలు చేసింది. ఇంట్లో ఎందరు ఉన్న అందరికి తల్లికి వందనం వర్తింపజేసింది. ఒకరికి కాదు..ఇద్దరికి కాదు.. రాష్ట్రంలో ఏకంగా మొదటి విడతే 54.94లక్షల మంది విద్యార్ధులకు 13వేలు చొప్పున జమ చేసి రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు చరిత్రలో ఒకే రోజు 10వేల కోట్లు తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసి ఓ నయా రికార్డు సృష్టించింది. 4కోట్ల జనాభాలో 54.94లక్షల మంది విద్యార్ధులు కాగా ఏకంగా 35.44లక్షల మంది తల్లుల మనసుల్లో చంద్రబాబు చెరగని ముద్ర వేశారు. నిధులు జమ అవుతున్న కొద్ది మాకు తల్లికి వందనం నిధులు పడ్డాయని ఒకరు, మా ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే ఇద్దరికి పడ్డాయని ఇంకొందరూ, తమ ఇంట్లో ముగ్గురు ఉన్నా అందరికి చంద్రబాబు డబ్బు వేశారని మరి కొందరు, మా ఇంట్లో నలుగురు ఉన్నా పడ్డాయని చెరగని సంతోషాన్ని వ్యక్తం చేశారంటే తల్లికి వందనం పథకంతో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఓ మెగా మైలేజీ ఇచ్చిన పథకంగా పేర్కొనడంలో సందేహం లేదు. ఎందుకంటే రాష్ట్ర వ్యాప్తంగా ఒక ఇంట్లో ఒక్కరే ఉన్న కుటుంబాలు 18.85లక్షలు కాగా, ఇద్దరు పిల్లలు ఉండే తల్లులు 14.55లక్షలు అయితే, ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబాలు ఏకంగా 2.17లక్షలు ఈ గణాంకాలు స్వయంగా రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించిన వివరాలు. అంతేకాకుండా వివిధ కారణాలతో అనర్హుల జాబితాలోకి వెళ్లిన తల్లులకు కూడ ఎక్కడైనా పొరపాటు జరిగి ఉంటే అధికారులు తప్పిదం చేసి ఉంటే ఈ నెల 26లోగా సరిదిద్దుతామని లోకేష్ ప్రకటన చేసి నిధులు జమ కాని తల్లులు బాధ పడకుండా సరి చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా తల్లికి వందనం పథకం ద్వారా కర్నూలు జిల్లాలో 3,67,614మంది విద్యార్ధులకు లబ్ది చేకూరి మొదటి స్థానంలో నిలవగా రెండవ స్థానంలో అనంతపురం జిల్లాలో 2,94,559మంది విద్యార్ధులు, 3వ స్థానంలో ప్రకాశం జిల్లాలో 2,65,550 మంది లబ్ది పొందారు. ఇక అతి తక్కువగా ఉత్తరాంధ్రలోని మణ్యం జిల్లాలో 1,08,950 మంది లబ్ది పొందారు. రాయలసీమ జిల్లాలోనే రాష్ట్రంలో పోల్చితే తల్లికి వందనం వర్తింపైన విద్యార్ధులు 10.78శాతం కాగా సంఖ్యను పరిశీలిస్తే 19,63,396మంది విద్యార్ధులు. అత్యధికంగా బీసీ వర్గాలకు చెందిన విద్యార్ధులు 30లక్షలు పైబడి తల్లికి వందనం లబ్ది పొందారు. ఒక పథకం ద్వారా ఇంత పెద్ద సంఖ్యలో లబ్ది చేకూరడం రాష్ట్ర చరిత్రలో ఇది రికార్డుగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఏది ఏమైనా తల్లులు కూటమికి జై కొడుతున్నారు. ప్రభుత్వం కూడ తల్లికి కూటమి వందనం అంటోంది. సూపర్ సిక్స్‌లో ఓ మెగా హామీని నెరవేర్చిన చంద్రబాబు సర్కార్ రాష్ట్రంలోనే క్రియాశీలక హామీగా రైతు భరోసా కూడ ఇదే విధంగా అమలు చేస్తే కూటమి సర్కార్‌కు తిరుగు ఉండదు.



విధ్యార్ధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

### నేరాల నియంత్రణకు

# కఠిన చర్యలు తీసుకోవాలి

### కొత్త న్యాయ చట్టాల మీద ప్రతి ఒక్కరూ పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

### నేర సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి

**రాయచోటి జూన్13 ప్రభాత వార్త**



రాయచోటిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నీ సమావేశ మందిరంలో మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు, నెలవారీ "నేర సమీక్షా" సమావేశం ను జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) శ్రీ.యం.వెంకటాద్రి నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల జిల్లా పరిధిలో చోటు చేసుకున్న ముఖ్య నేర సంఘటనలు, వాటిపై చేపట్టిన విచారణలు, పరిష్కారాల పురోగతి పెండింగ్ లో ఉన్న గ్రేవ్ మరియు నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, 174 సిఆర్పీసీ కేసులు, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించబడింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ పోలీసు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా సిసిటీఎన్ఎస్ లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని తెలిపారు. అలా అన్ని వివరాలు నమోదు చేయడం వలన కేసులు మరియు వ్యక్తుల పూర్తీ సమాచారం తెలుస్తుందని అది అందరికీ ఉపయోగపడేలా దోహదం చేస్తుందని తెలిపారు. ఈ నేర సమీక్షా సమావేశంలో ప్రతి పోలీస్ స్టేషన్ కు సంభందించిన అధికారులను వారి యొక్క కేసుల వివరాలు సిసిటీఎన్ఎస్‌లో నమోదు చేశారో లేదో అని అరా తీశారు. సిసిటీఎన్ఎస్‌లో ముఖ్యంగా గ్రేవ్ కేసులు నాన్ గ్రేవ్ కేసుల లో పార్ట్ 1, పార్ట్ 2 సీడీలు అప్డేట్ గా ఉండేటట్టు చూసుకోవాలన్నారు, మర్డర్ కేసుల్లో, 174 కేసుల్లో త్వరితగతిన పురోగతి పొందే విధంగా చూసుకుంటూ అభియోగ పత్రాలను వీలైనంత త్వరగా కోర్ట్ లో దాఖలు చేయాలన్నారు. గంజాయి వినియోగించే వారి వివరాలను బట్టి వారికి కౌన్సిలింగ్ లేదా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళా సంబంధిత నేరాలపై ప్రత్యేక శ్రద్ధతో దర్యాప్తు జరపాలి, దొంగతనాలు జరగకుండా చూడాలని, నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త న్యాయ చట్టాల మీద అవగాహన కలిగివుండాలని, నాన్ బెయిలబుల్ వారెంట్లు అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కాప్స్ పైన అందరూ దృష్టి పెట్టాలని మరియు ఆల్టర్నేషన్ రిపోర్ట్స్ సరిగా ఉందో లేదో చూసుకోవాలన్నారు. ఐటీ యాక్ట్ కేసుల్లో కోర్ట్ వారికి అభియోగపత్రం సమర్పించారో లేదో, లేదంటే ఎందుకు వేయలేదు, ఒకవేళ కోర్టు వారు సీసీ నెంబర్ లేదా పిఆర్ సి ఇవ్వకపోతే, సంబంధిత కోర్టు కానిస్టేబుల్ తో సమన్వయం అయ్యి సీసీ నెంబర్ లేదా పిఆర్ సి నెంబర్ వచ్చే విధంగా ప్రయత్నం చేయాలని తెలియజేశారు. అందరు అధికారులు సీడీ ఫైల్స్ సిసిటీఎన్ఎస్ లో అప్లోడ్ అవుతున్నాయో లేదో అనేది తప్పనిసరిగా చూసుకోవాలని అలా అయితే మనం ఖచ్చితంగా సమాచారాన్ని పొందగలమని అదనపు ఎస్పీ సూచించారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాల స్థితిగతులు, పట్టుబడిన నిందితుల వివరాలు, విచారణ పురోగతి, నేర నివారణకు చేపట్టిన చర్యలపై అదనపు ఎస్పీ కి వివరించారు. సమిష్టి కృషి, సమన్వయంతో పనిచేసి జిల్లాలో నేరనియంత్రణకు, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని అదనపు ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మదనపల్లి డిఎస్పీ ఎస్. మహేంద్ర, స్తానిక పోలీసు అధికారులు, మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



# మండలంలో రహదారులకు భూమి పూజలు

**ఒంటిమిట్ట జూన్ 13( ప్రభాతవార్త)**
ఒంటిమిట్ట మండలంలో రహదారులకు శుక్రవారం రాజంపేట నియోజకవర్గ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి. జగన్మోహన్ రాజు భూమి పూజ చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా పార్లమెంట్ అధ్యక్షుడు మండలానికి విచ్చేయడంతో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు హర్షద్వనులు చేస్తూ ఆయనకు గజ మాలలు వేసి టపాసులతో, స్వాగతం పలికారు. అనంతరం ఆయన మండలానికి చెందిన ఒంటిమిట్ట, ధవంతరం పల్లె,పెన్న పేరూరు, గంగ పేరూరు తప్పెటివారిపల్లె గ్రామాల రహదారుల అభివృద్ధికి భూమి పూజ చేసి లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా చమర్తి. జగన్మోహన్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీలోనే కచ్చితంగా జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాడని ధ్యేయంగా పెట్టుకున్నాడన్నారు. ఒంటిమిట్ట మండల గ్రామాల అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమార్తం 5 కోట్ల రూపాయలు నిధులతో రహదారులకు తానే స్వయంగా భూమి పూజ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను ఒంటిమిట్టకు రాగానే మండల ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సాదర ఆహ్వానం పలకడంతో తాను కూడా అందరిలో ఒకడిగా ఉన్నానని ఆనందంతో మురిసిపోవడం జరిగిందన్నారు. ఒంటిమిట్ట మండల అభివృద్ధి తన బాధ్యతగా స్వీకరిస్తున్నానని అందరూ కలిసికట్టుగా పనిచేసి తనను ముందుకు నడిపించాలని కోరడం జరిగింది. కార్యకర్తలందరూ గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకొని తనకు తెలియజేసినట్లయితే ఆ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వచ్చి పరిష్కారమయ్యేందుకు సిద్ధంగా ఉన్నానన్నాడు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ సమస్యలు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపాడు.. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కోసం ప్రజల కోసం పనిచేస్తుందని అండగా నిలుస్తుందని మరొకసారి తెలియజేశాడు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ముఖ్యంగా త్రాగునీటి సమస్య, రహదారులు, ప్రజలకు కావలసిన అన్ని మోలిక సదుపాయాలు సత్వరమే తీర్చి పార్టీ పురోభివృద్ధి కోసం, ప్రజల కొరకు శ్రమిస్తామన్నారు. రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడుతూ కనిపిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశాడు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గజ్జల. నరసింహారెడ్డి, కాంట్రాక్టర్ వెంకటరమణ, తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



# మళ్లీ టిడిపి జెండాల తొలగింపు

### పోలీసు అదుపులో నలుగురు వీరిలో ముగ్గురు మైనర్లు

### అన్యాయంగా అరెస్టు చేశారని పోలీస్ స్టేషన్ కు వచ్చిన మైనర్ల తల్లిదండ్రులు

### డీఎస్పీ జోక్యంతో సద్దుమణిగిన సమస్య

**పులివెందుల,జూన్13,ప్రభాత వార్త:**
టిడిపి మహానాడు సందర్భంగా జెండాలు, తోరణాలు తొలగించడంతో 18 మందిపై కేసు నమోదు చేసి 13 మందిని రిమాండ్ కు పంపిన విషయం తెలిసిందే. గురువారం రాత్రి పట్టణంలోని కదిరి రింగ్ రోడ్డులో టిడిపి జెండాలు చించి కాల్చడం జరిగిందని అడ్డు వచ్చిన వ్యక్తిపై దాడి చేయడం జరిగిందని ఫిర్యాదుతో నలగరిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు మైనర్లు ఉన్నారు. మైనర్ల తల్లిదండ్రులు మా పిల్లలపై అన్యాయంగా కేసులు పెడుతున్నారని పోలీస్ స్టేషన్ కు రావడం జరిగింది. డీఎస్పీ మురళి నాయక్ వారితో మాట్లాడి తప్పు చేయకపోతే మీ పిల్లలను పంపించడం జరుగుతుందని, దీని వెనుక ఎంతటి వారు ఉన్నా వదిలే ప్రసక్తి లేదన్నారు. న్యాయం చేయడానికి పోలీసులు ఉన్నది అని అన్యాయాన్ని పోలీసులు ఎవరు ప్రోత్సహించరని చెప్పడంతో మహిళల తల్లిదండ్రులు స్టేషన్ నుంచి వెళ్లిపోవడం జరిగింది.

**పరారీలో ఉన్న వారిని త్వరలో పట్టుకుంటాం : డిఎస్పి మురళి నాయక్**
మహానాడు సందర్భంగా టిడిపి జెండాలు తొలగించిన కేసులో పరారీలో ఉన్న ఐదు మందిని త్వరలో పట్టుకుంటామని పులివెందుల డిఎస్పి మురళి నాయక్ తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్ లో మీడియాతో మాట్లాడుతూ మహానాడు సందర్భంగా ప్రభుత్వ జాగాలలో టిడిపి నాయకులు జెండాలు , తోరణాలు కట్టడం జరిగిందని వీటిని వైసీపీకి చెందిన నాయకులు చించి వేయడం తోపాటు అడ్డు వచ్చినా టిడిపి నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి పై దాడి చేశారని, విజయ్ కుమార్ రెడ్డి ఫిర్యాదు మేరకు 18 మందిపై కేసు నమోదు చేశామని వారిలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తోపాటు 13 మందిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపామన్నారు. మరో ఐదు మంది అయినా కడప ఎంపీ అవినాష్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డి, గంగిరెడ్డి, జగదీష్ రెడ్డి, విక్రమ్, విజయ శేఖర్ రెడ్డి ల కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టడం జరుగుతున్నదని రెండు మూడు రోజుల్లో అరెస్ట్ చేస్తామని డిఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ చాంద్ బాషా పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరు రక్తదానం చేద్దాం...బాధితులలో భరోసా నింపుదాం





**కడప జూన్ 13( ప్రభాతవార్త)**
కలిసికట్టుగా బాధితులను కాపాడుదాం "ప్రపంచ రక్తదాత దినోత్సవము" లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖా, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, APSACS వారి ఆదేశాల మేరుకు ఈ రోజు కడప టౌన్ నందు స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా, రీజినల్ బ్రాంచ్ మరియు ప్రభుత్వ రక్త నిధి, ప్రభ్య సర్వోజన ఆసుపత్రి (GGH), కడప వారి సహకారం తో మెగా బ్లడ్ డొనేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారి డాక్టర్ రీ. నాగరాజు మరియు బ్యాంకు చీఫ్ మేనేజర్, Sri.Krishna Kishore, మరియు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారి డాక్టర్ రవి బాబు మరియు బ్యాంకు మేనేజర్ అనిల్ కుమార్, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర, APSACS క్లస్టర్ ప్రోగ్రమ్మే అధికారి భాస్కర్, మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. SBI 75 సంవత్సరాల వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. "ప్రపంచ రక్తదాత దినోత్సవము" ప్రతి సంవత్సరము లగే ఈ ఏడాది కూడా జూన్ 14వ తేదీన నిర్వహించబడుతుంది. జూన్ 14వ తేదీన "కార్ల్ లాండ్ స్టైనేర్" జన్మ దినాన్ని పురుస్కరించుకొని 2004 వ సంవత్సరం నుండి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా "ప్రపంచ రక్తదాత దినోత్సవము" ను నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ జూన్ 14వ తేదీన స్వచ్ఛంద రక్తదాతందలరీని కృతజ్ఞత పూర్యకంగా వారి సేవానిరతికి అభినందనలు తెలుపుటకు కార్యవుమాలు ఏర్పాటు చేయబడుతాయి. ఆరొగ్య వంతులైన 18సం॥ నిండిన 45రీబి ల శరీర బరువు కలిగిన 60సం॥ లోపు వారందరూ సంవత్సర కాలంలో 3 నుండి 4 పర్యాయములు రక్తదానం చేసేటట్లు అవగాహన కల్పించబడుతుంది. ప్రపంచ రక్తదాతల కార్యక్రమాన్ని ప్రభుత్వ సర్వజనని ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ మరియు ఈతర బ్లడ్ బ్యాంకు వారు వారం రోజుల పాటు స్వచ్ఛంద రక్తదానం చేయవలసినదిగా జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు మరియు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారి డాక్టర్ రవి బాబు ఒక ప్రకటనలో తెలియజేయడమైనది. ప్రభత్వ గుర్తింపు పొందిన రక్తనిధిలో మాత్రమే సురక్షిత రక్తం అందుబాటులో ఉంటుంది. జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సం (World Blood Donors Day) కార్యక్రమానికి ప్రత్యేకమైన Theme కలదు. అదేమంటే "Give Blood, Give hope, together We save lives" ( ప్రతి ఒక్కరు రక్తదానం చేద్దాము, బాధితులలో భరోసా నింపుదాం, కలిసికట్టుగా బాధితులను కాపాడుదాం ) ఈ స్లోగన్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలి. 14 వ తేదీన రిమ్స్ బ్లడ్ బ్యాంక్ వారు స్థానిక ఎయిర్పోర్ట్ నందు ఉదయము 10 గ లకు రక్తదాతల అభినందన కార్యక్రమము మరియు రక్తదాన శిభిరము నిర్వహించబడటం జరుగుతుంది.



## మలేరియ నియంత్రణ, నివారణకు ప్రజల్లో అవగాహన కల్పిద్దాం

**తలుపుల పీహెచ్సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి**




పీలేరులో మలేరియ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

**పీలేరు జూన్ 13 ప్రభాతవార్త:**
మలేరియ నియంత్రణ, నివారణకు ప్రజల్లో అవగాహన కల్పిద్దామని తలుపుల ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. మలేరియా మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీలేరు పట్టణంలోని బండ్లవంకలో వైద్యాధికారి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని తమ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్లాస్మోడియం పరాన్న జీవి సంక్రమణ కలిగిన ఆడ అనాఫిలాస్ దోమ వల్ల మలేరియా వ్యాపిస్తుందని, చలి జ్వరం, తలనొప్పి, వాంతులు ఈ వ్యాధి ప్రధాన లక్షణాలని అన్నారు. వ్యాధి నిర్ధారణ చికిత్స విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. చలి జ్వరమా మలేరియా కావచ్చు అంటూ నినాదాలు చేస్తూ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈఓ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, రెడ్డప్ప, ఏఎన్ఎం లు ప్రమీల, భార్గవి, చంద్రకళ, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## భూసార, పంటలకు అనుగుణంగా, ఎరువులు వేసుకోవాలి

**సిద్ధవటం జూన్ 13 ప్రభాతవార్త**



పంటల సాగు కోసం, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన, భూసార పరీక్షలను, అనుగుణంగా, ఎరువులు వాడకం వల్ల, రైతులకు ఖర్చులు, చాలా వరకు తగ్గింపు, అవుతాయని, మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ రెడ్డి తెలిపారు మండలంలోని వంతాటిపల్లి,టక్కోలి గ్రామాలలో ఆయన శుక్రవారం వరి నారు మడులను పరిశీలించారు ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి రమేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు వరి నాట్లు నాటేముందు, 20 కిలోలు, జింక్ సల్ఫేట్ ను దుక్కిలో, వేసుకోవాలని వేసిన తర్వాత, 4 లేక, 5 రోజుల వ్యవధిలో ఒక ఎకరాకు ఒక బస్తా, డీఏపి, లేదా, సింగిల్ సూపర్ ఫాస్పేట్, ( ఎస్ ఎస్ పి) దుక్కిలో ఒక ఎకరాకు, 3 బస్తాలు, వేసుకోవాలన్నారు, వరి నారు పీకే10 రోజుల ముందు, వరిలో కాండం, తొలచు, పురుగు, ఉల్లి కోడు రాకుండా ఉండడానికి కార్బో ఫిరాన్, 3, జి, గుళికలు, నారు మడిలో, వేసుకోవాలని రైతులు సూచించారు, ఇలా వేయడం వల్ల, ప్రధాన పొలాల్లో, తెగుళ్ల పంటను ఆశించదన్నారు, నారు పీకి నాటే టప్పుడు, నారు కొనలను తుంచి నాటాలన్నారు, నారు కొన భాగంలో కాండం తొలచ పురుగులు గుడ్లు పెట్టి ఉంటుందని అది తుంచితే అక్కడే గుడ్లను నాశనం చేయవచ్చని, ఈవో రమేష్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం వ్యవసాయ సహాయకులు, వంశీశివ పనింద్ర, రైతు సోదరులు పాల్గొన్నారు

## వేరుశనగ విత్తన కాయల కోసం ముమ్మర రిజిస్ట్రేషన్

**తంబళ్లపల్లె జూన్ 13 ప్రభాతవార్త :**



మండలం లోని 12 సచివాలయాల పరిధిలో వేరుశనగ విత్తన కాయల కోసం వ్యవసాయ విస్తరణ అధికారులు ముందస్తు రైతుల నుండి పాస్బుక్కుల ఎంట్రీ రిజిస్ట్రేషన్ ముమ్మరంగా చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి రమణ కుమార్ ఆదేశాల మేరకు వ్యవసాయ విస్తరణ అధికారులు కార్యాలయం తో పాటు ప్రతి గ్రామంలో పర్యటించి రైతులకు విత్తన కాయల పంపిణీ కి వారి ఇంటి వద్దనే పాస్బుక్కుల ద్వారా ఎంట్రీ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. సోమవారం నుండి మండలంలో వేరుశనగ విత్తన కాయల పంపిణీ చేపట్టనున్నట్లు ఎద్దుల వారి పల్లి, పరసతోపు, గుండ్లపల్లి, తంబళ్లపల్లె ఏ ఈ ఓలు సురేష్, అంబేద్కర్, జయరాం, మల్లీశ్వరి లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఈఓ లు గ్రామాలలో వేరుసెనగ పంట సస్యరక్షణ పై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

## వాయిదా పడ్డ మండల సమావేశం..



**సుండుపల్లి, జూన్ 13, ప్రభాత వార్త:**
మండల పరిధిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయము శుక్రవారం జరగవలసిన మండల సర్వసభ్య సమావేశము కోరం లేనందువలన వాయిదా వేసామని తిరిగి 18 తేదీ బుధవారము మండల సర్వసభ్య సమావేశము నిర్వహిస్తామని మండల ప్రజాపరిషత్ అధికారి సుధాకర్ రెడ్డి తెలియజేశారు.

## సబ్ జైల్ సూపరిండెంట్‌గా గంగాధర్

**పులివెందుల,జూన్13, ప్రభాత వార్త:**



పులివెందుల సబ్ జైల్ ఇంచార్జ్ సూపరిండెంట్ గా ఎస్సై డి. గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా కొండాపురం మండల నివాసి అయిన ఎస్సై గంగాధర్ 2018 లో ఎస్ఐగా ఎంపికై మొదట సారీ గుంటూరు జిల్లా లో బాధ్యతలు స్వీకరించారు.అనంతరం పలు చోట్ల పని చేస్తూ కమలాపురం సబ్ జైల్ సూపరిండెంట్ గా బదిలీ అయ్యారు. పులివెందుల సబ్ జైల్ సూపరిండెంట్ అయ్యవారు రెడ్డి బదిలీ అవ్వడంతో గంగాధర్ ను పులివెందుల సబ్ జైల్ సూపరిండెంట్ ఇంచార్జిగా శాఖా అధికారులు ఉత్తర్వులు జారి చేయడంతో ఆయన పులివెందుల సబ్ జైల్ సూపరిండెంట్ గా బాధ్యతలు స్వీకరించారు.

## మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**ముద్దనూరు, జూన్ 13, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని విద్యుత్ కేంద్రాలలో మరమ్మత్తుల కారణంగా శనివారం నాడు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంద ని ఏఈ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ముద్దనూరు, ఉప్పలూరు, మంగపట్నం విద్యుత్ కేంద్రాలలో, విద్యు లైన్ ల మరమ్మత్తులు కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయంపై మండల విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలన్నారు.

## కూటమి పాలనలో ప్రజలు సుభిక్షం



**వేంపల్లె :జూన్ 13:(ప్రభాత వార్త)**
కూటమి ప్రభుత్వ పాలనలో ఎడాది నుండి ప్రజలు సుభిక్షంగా ఉన్నారని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి అయిన సందర్భంగా స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని అమ్మ నాన్న అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నందిపల్లెకు చెందిన మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి వృద్ధాశ్రమంలోని అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నట్లు చెప్పారు. రాక్షస పాలన నుండి ప్రజలు విముక్తి అయ్యి ఎడాది అయ్యిందని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబు పరిపాలనే ఉండాలని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. చంద్రబాబుకు ప్రజల సహకారం కూడ ఉండాలని కోరారు. గతంలో అభివృద్ధి పనులు జరగాలంటే వారి స్వలాభం ఆశించి పనులు చేయడం జరిగిందని చెప్పారు. కూటమిలోని నాయకులు ప్రజల కోసం ఆలోచించిస్తున్నట్లు చెప్పారు. మంచి ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గాలేరి నగరికి కూడ రూ 1000 కోట్లు చంద్రబాబు ఇటీవల ప్రకటించడం జరిగిందని చెప్పారు. త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం పాలనకు చెందిన ఎడాది కాలంలో ప్రజలకు జరిగిన మంచి పనులను తెలియ జేసేందుకు సంబరాలు చేయాలని సిఎం ఆదేశించడం జరిగిందని చెప్పారు. ఇందులో భాగంగానే టిడిపి నేత రామగంగిరెడ్డి వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, ఎస్పీ శివకృష్ణారెడ్డి, తక్కోల షరీఫ్, మహమ్మద్ ఇనాయతుల్లా, వేమా కుమార్, గోగుల మల్లికార్జున, యాసిన్, గంగాధర్ రెడ్డి, రాహుల్ తో పాటు టిడిపి నేతలు పాల్గొన్నారు.

## డబులింజన్ సర్కార్ దూసుకు పోవడం లేదు చతికిల పడింది

**వేంపల్లి: జూన్ 13 (ప్రభాత వార్త):**



రాష్ట్రం లో డబులింజన్ సర్కార్ దూసుకుపోతున్నదని టిడిపి నాయకులు చెప్పడం హాస్యాస్పదమని రాజ్యసభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి అన్నారు.శుక్రవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అప్పుల్లో దూసుకు పోతున్నదని,అభివృద్ధిలో చతికిల పడిందని ఎద్దేవా చేశారు.2023 24 లో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన గ్రాంట్ రు 34,698 కోట్లు కాగా 202425 లో రు 20,135 కోట్లు మాత్రమే వచ్చింది. అనగా రు 14,563 కోట్లు తగ్గింది. సంజీవినీ లాంటి ప్రత్యేక హోదా రాలేదు. రాయల సీమకు, ఉత్తరాంధ్ర కు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ రాలేదు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మాణం కాలేదు. దుగరాజపట్నం ఓడ రేవు నిర్మాణం కాలేదు.రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం గ్రాంట్ ఇవ్వలేదు.అప్పు తెచ్చుకోమని చెబుతోంది. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నత్త నడకన సాగుతోంది. 9,10 షెడ్యూల్ల లోని సంస్థలు రాష్ట్రానికి రాలేదు.విశాఖ, విజయవాడ మెట్రో రైల్లు రాలేదు.202324 కంటే 2024 25 ల మూల ధన వ్యయం రు 4,413 కోట్లు తగ్గింది.ఒక్క ఏడాది లోనే రు 1,58,604 కోట్ల అప్పు చేసింది. జిఎస్టి వసూళ్లు అన్ని రాష్ట్రాల్లో పెరుగుతూ వుంటే మన రాష్ట్రం లో తగ్గుతూ వున్నాయి.ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. రియల్ ఎస్టేట్ భారీగా పతనమైంది.విద్యుత్ చార్జీలు దూసుకు పోతున్నాయ్.ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రం లో డబులింజన్ కూటమి ప్రభుత్వం అప్పుల్లో దూసుకు పోతోంది, అభివృద్ధి లో చతికిల పడిందని తులసి రెడ్డి అన్నారు.

## ఉద్యోగులకు బదిలీలు సహజం



**దువ్వూరు, జూన్ 13, ప్రభాతవార్త:**
ప్రభుత్వంలో పనిచేసే ఉద్యోగులకు బదిలీలు సహజం అని మండల తహసీల్దార్ అక్బర్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ అక్బర్‌బాషాను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు పనిచేసే చోట మంచి పేరు తెచ్చుకోవాలని అప్పుడే తమ ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించినట్లు అవుతుందని అన్నారు. పనిచేసిన కాలంలో అక్కడ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వంలో పనిచేసే ఉద్యోగులకు బదిలీలు ఉంటాయని వాటిని స్ఫూర్తిగా తీసుకొని మరింత పనిచేయాలన్నారు. 9నెలలు ఇక్కడ పనిచేసిన సిబ్బంది, వీఆర్వోలు అందరూ సహకరించారని అన్నారు. ఈ సంధర్భంగా తహసీల్దార్ అక్బర్ బాషాకు ఘణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ వేణుగోపాల్, కరీముల్లా, ఆర్ఐ జాన్సన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ కేవైసీ తప్పక నిర్వహిచుకోండి

**ముద్దనూరు, జూన్ 13, ప్రభాతవార్త:**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకాన్ని లబ్ధి పొందాలంటే ప్రతి ఒక్క రైతు ఈ కేవైసీ ప్రక్రియను తప్పకుండా నిర్వహించుకోవాలని మండలంలోని రైతులకు శుక్రవారం నాడు మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. రైతులు వారి పరిధిలోని రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఈ కేవైసీ ప్రక్రియను తప్పకుండా చేయించుకోవాలని వివరించారు. ఈ కేవైసీ ప్రక్రియకు ఈనెల 20వ తేదీ వరకు గడువు ఉందని గడువు లోపల రైతులు తప్పకుండా ఈ కేవైసీ ప్రక్రియ ను తప్పకుండా నిర్వహించుకోవాలన్నారు.

# ప్రజలకు సేవ చేయడంలోనే సంతృప్తి

**రాజంపేట జూన్ 13 ప్రభాతవార్త**



ప్రజలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి అన్నారు. 60వ పుట్టినరోజు సందర్భంగా కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం తన అన్న మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య నిరాడంబరంగా పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తనకు రాజకీయంగా రాజ్యసభకు పంపి ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. రాజకీయంగా రాజంపేట నియోజకవర్గంలో తమ కుటుంబానికి ప్రజలు అండగా నిలిచారని ,అదే స్ఫూర్తితో తాను కూడా ప్రజలకు తన చేతనైన మేర సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మేడ మల్లికార్జున్ రెడ్డి, మేడా సుచరిత, వెంకట్రాంరెడ్డి, కృష్ణ తేజ, మేడ సాయి రెడ్డి, రోహిత్ రెడ్డి,మేడా మధుసూదన్ రెడ్డి, మేడ శిరీష, గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఓటమి ఎరుగని నేత హసీనా..



**షేక్ హసీనా.. ప్రస్తుతం ప్రపంచమంతా వినిపిస్తోన్న పేరు. బంగ్లా జాతిపిత కూతురుగా ప్రపంచంలోనే అత్యధిక కాలం ఏలిన మహిళా దేశానేతగా. బంగ్లాదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించిన ఐరన్ లేడీగా.. ఎన్నో కీర్తికిరీటాల్ని సొంతం చేసుకున్న నాయకురాలు. నాన్న నమ్మిన్న సిద్ధాంతాలకు కట్టుబడి.. స్వదేశం కోసం ఆమె అలుపెరుగని పోరాటమే చేశారు!**

అది ఆగస్టు 15, 1975 ఢాకా నగరం అప్పుడే నిద్రలేస్తోంది. ఆకస్మాత్తుగా బుల్లెట్ల శబ్దం. అదెక్కడో కాదు, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ ముజిబుర్ రెహమాన్ వ్యక్తిగత నివాసంలోనే. ఆర్మీ ఇంటిని చుట్టుముట్టిందని ఆ కుటుంబానికి అర్థమైంది. అంతా ఒక గదిలో దాక్కున్నారు. కాల్పులు నిలిచిపోయాయనుకుని ఆయన బయటకు వచ్చారు. వెంటనే ఆర్మీ అధికారులు ఆయన్ని చుట్టుముట్టి, బుల్లెట్ల వర్షం కురిపించారు. 18 తూటాలు శరీరాన్ని ఛిద్రం చేశాయి. ముజిబుర్ రక్తపు మడుగులో పడిపోయారు.
కుటుంబంలో అందరూ చనిపోయారు. కానీ, ఈ మారణకాండ నుంచి ఆయన ఇద్దరు కూతుళ్లు తప్పించుకున్నారు. ఎందుకంటే వాళ్లిద్దరూ అప్పుడు జర్మనీలో ఉన్నారు. వారిలో ఒకరే బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా. బంగ్లాదేశ్ రాయబారి, తన కుటుంబ మరణవార్త వినిపించిన వెంటనే ఆమె దిగ్భ్రాంతికి గురయ్యారు. అప్పటి నుంచీ హసీనా జీవితం మారిపోయింది. అలాంటి పరిస్థితుల నుంచి బంగ్లా ప్రధాని అయ్యేవరకూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు హసీనా.
ఐదుగురు పిల్లల్లో పెద్దవారు హసీనా. 1947లో తూర్పు పాకిస్థాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)లో జన్మించారు. తండ్రి అప్పటికే రాజకీయనాయకుడు. బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో చురుగ్గా ఉండేవారు. దీంతో పాకిస్థాన్ ప్రభుత్వం అనేకసార్లు ఆయన్ని అరెస్టు చేసింది. అందుకే హసీనా, ఆమె తోబుట్టువులకు అందరి పిల్లల్లా నాన్నతో కూర్చొని సరదాగా కబుర్లు చెప్పే అనుభూతులే లేవు.
తండ్రి ముజిబుర్, పాకిస్థానీ డిక్టేటర్ల గురించి చెప్పిన విషయాలూ, ఆయన్ను జైలుపాలు చేయడం..లాంటి పరిస్థితులు చిన్నారి హసీనాను ఆలోచింపజేసేవి. పాకిస్థాన్ మీద వ్యతిరేకతను పెంచాయి. ఢాకా యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లోనే రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు హసీనా. 1967లో న్యూక్లియర్ సైంటిస్ట్ వాజీద్ మియాను పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. అప్పటికి బంగ్లాదేశ్ ఉద్యమం మరింత బలం పుంజుకుని 1971లో భారత్ సాయంతో బంగ్లా స్వతంత్ర దేశంగా ఏర్పడింది.

**.. ద్వేషం పెంచుకోలేదు!..**

నాన్న బంగ్లా అధ్యక్షుడు అయ్యారు. అంతా బావుంది కదా అనుకుని జర్మనీలో ఉనసన భర్త దగ్గరకు వెళ్లిపోయారు హసీనా. 1975 జులైలో కుటుంబమంతా తనను చూడ్డానికీ వచ్చారు. అయితే, అదే వాళ్ల చివరి చూపని అనుకోలేదామె. తరవాత నెలరోజులకే కుటుంబమంతా చనిపోయారన్న వార్త విన్నారు. తండ్రి మృత్యుబడిలోకి జరిగిపోయిన ఆ రాత్రి ఆమెకు ఎప్పటికీ పీడకలే. కానీ ఆమె దాన్నే తలచుకుంటూ కుమిలిపోలేదు. అది జరిగిన కొద్ది రోజులకే హసీనా ఢిల్లీ వచ్చి ప్రధాని ఇందిరాగాంధీని కలిశారు. భారత్‌లో ఆరేళ్లు నివసించారు. ఢాకాలో సైన్యం దేశాన్ని చేతుల్లోకి తీసుకుంది. దాంతో ఆమెకు ఇంటికి వెళ్లడమూ కష్టమైంది. కానీ ఎన్నో సంప్రదింపులతో ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టగలిగారు హసీనా. కుటుంబన్ని పొట్టనబెట్టుకున్న సమాజాన్ని ద్వేషించకుండా.. ఆ దేశానికే సేవ చేసేందుకు.. 1981లో నాన్న స్థాపించిన పార్టీ అవామీ లీగ్‌కు అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. వేలమంది ప్రజలు ఎయిర్‌పోర్టు నుంచి ఇంటి వరకూ ఆమెకు స్వాగతం పలికారు. 15 పార్టీలను కూడగట్టి మిలిటరీ రెజీమ్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేశారు. 1983లో ఆర్మీ ఢాకా యూనివర్సిటీలోకి ప్రవేశించి విద్యార్థుల మీద కాల్పులు జరిపింది. దానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తోన్న హసీనాను ఆర్మీ కళ్లకు గంతలు కట్టి మరీ కస్టడీలోకి తీసుకుంది. ఇలాంటి పరిస్థితులు నిత్యం జరిగేవి. ఇలా ఎన్నో నిర్బంధనలు.. 19 సార్లు హత్యాయత్నాలూ.. హసీనాను ఏమీ చేయలేకపోయాయి. 1996లో మొదటిసారి ప్రధాని అయ్యారామె ఆ తరవాత కథ మారింది. 2008 2014,2019, 2024 ఎన్నికల్లో వరుసగా నాలుగుసార్లు మొత్తం ఐదు పర్యాయాలు ప్రధానిగా వ్యవహరించి ప్రపంచంలోనే ఎక్కువకాలం పాలించిన మహిళగానూ చరిత్ర సృష్టించారు. అనేక సంస్కరణలతో దేశ ఆర్థిక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించారు. ప్రభుత్వ సృష్టించారు. అనేక సంస్కరణలతో దేశ ఆర్థిక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించారు. ప్రభుత్వ విధానల్లో మిలిటరీ జోక్యం కల్పించుకోకుండా చేశారు. తండ్రి నుంచి నేర్చుకున్న లౌకికవాదాన్ని ప్రోత్సహిస్తూ మైనారిటీల మద్దతునీ దక్కించుకున్నారు. కానీ అప్పట్లో తండ్రి తెచ్చిన రిజర్వేషన్లే.. నేడు ఆమెను గద్దె దిగేలా.. చివరికి దేశాన్నీ వీడేలా చేయడం బాధాకరం.

# ఆమె సేవలను 'బ్రిక్స్' మెచ్చింది !




**వారిది విశాఖపట్నం నాన్న రెహమాన్ లారీ డ్రైవర్, అమ్మ మదీనాబీబీ చికెన్ దుకాణం నడుపుతారు. పేద కుటుంబం నిరక్ష్యరాస్యులు అయినా ఆ తల్లిదండ్రులు ఎక్కడా వెనకడుగు వేయలేదు. పిల్లలను బాగా చదువుకోవాలని ప్రోత్సహించారు..** వారి కృషి ఊరికే పోలేదు. కుమార్తెల్లో ఒకరైన ఆయేషా ఆ కుటుంబప్రతిష్ఠను మరో స్థాయికి తీసుకెళ్లారు. బ్రిక్స్ దేశాల యూత్ సమ్మిట్లో పాల్గొని అందరి ప్రశంసలందుకున్నారు. తన ప్రస్థానం గురించి అడిగితే ఆమె ఇలా చెబుతారు.. మేం ముగ్గురమ్మాయిలం. అమ్మ నాన్న చదువు కోలేదు. మాకు సొంతిల్లు కూడా లేదు. కానీ నాన్న మమ్మల్ని చదువుకోవాలని నిరంతరం ప్రోత్సహించేవారు. ప్రభుత్వ స్కూళ్లలోనేచదివినా మాకు ఎలాంటిలోటూ రానిచేనచవారు కాదు. పెద్దక బిటెక్, రెండో అక్క ఎంబిఏ చదివారు. నేను విసయనగరం కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంలో పిజి చదివా. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆర్గానిక్ కెమిస్ట్రీలో పిహెచ్‌డి సీటు సాధించా. అంత పెద్ద చదువులు చదివించలేని అమ్మానాన్నలను కష్టపెట్టలేక ఫెలోసిప్‌తో సర్దుకుంటానని వారికి చెప్పి వచ్చా. అన్నట్లుగానే ఇప్పటికీ ఇంటి నుంచి డబ్బులు తీసుకోలేదు. నా ఫెలోసిప్ డబ్బులనే సరిపెట్టుకున్నా. పిహెచ్‌డి చేస్తున్నప్పుడే విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించాను దానికో నేపథ్యం ఉంది. డిగ్రీ చదువుతున్న సమయంలో ఫీజు రీలయంబర్స్‌మెంట్ నిలిచిపోతే ఎబివిపి కార్యకర్తలు మా తరపున పోరాడారు. నాకూ అలా అందరి తరఫున నిలబడాలని, నాయకురాలిగా ఎదగాలని అనిపించేది. సెంట్రల్ యూనివర్సిటీకి వచ్చాక దానికో రూపం వచ్చింది. ఎబివిపి సభ్యత్వం తీసుకుని సంస్థాగత కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేదాన్ని. హెచ్‌సియూలో ఎబివిపిలో చేరిన ఏకైక ముస్లిం అమ్మాయిని నేనే. చదువుకుంటూనే యూనివర్సిటీ తరఫున పలు సామాజిక సేవా కార్యకలాపాల్లో పాల్గొన్నాను. మానవ హక్కులు, రుతుక్రమం సమయంలో పాటించాల్సి న శుభ్రత గురించి మురికివాడల్లో ప్రచారం చేశాను. మహిళా సాధికారత కోసం మిషన్ సహస్రి కింద పలు కార్యక్రమాల్లో పాల్గొన్నాను. అటు చదువునూ ఎక్కడా నిర్లక్ష్యం చేయలేదు. ఇటీవల రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నేను మాత్రమే ఎంపికయ్యాను. యూత్ కమ్యూనిటీ సర్వీసెస్, వాలంటరీ వర్క్‌లపై నన్ను బ్రిక్స్ సదస్సు అభినదించింది. వివిధ విషయాలపై నా ప్రతిపాదనలను కేంద్ర మంత్రి రక్షా ఖాడ్సే కూడా ప్రశంసించారు. ఇంట్లో ముగ్గురూ ఆడపిల్లలే.. ఒక్క కొడుకు లేదని తలోకరకంగా మాట్లాడేవారు వాటిని పట్టించుకోకుండా నాన్న ప్రోత్సహించేవారు. సొంతంగా ఎన్జీవో ఏర్పాటుచేయాలని పిహెచ్‌డిలో చేరినప్పుడే నిశ్చయించుకున్నా.

# పరిమళంతో జ్ఞాపకశక్తి మెరుగు..

అమ్మకిస్తే జాగ్రత్తగా దాస్తుందని, పిల్లలు వస్తువులను మనకిస్తారు. తీరా తిరిగి వాళ్లడినప్పుడే చిక్కంతా. జాగ్రత్తగా దాచిపెట్టామని మాత్రమే గుర్తుంటుంది. అయితే.. ఎంతకూ జ్ఞాపకం రాదు. పని ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటివి ఎదురైనప్పు జ్ఞాపకశక్తి దూరమవుతుంది. అలాగే మెనోపాజ్ సమయంలోనూ ఇది తగ్గుతుంటుంది. దీన్ని తిరిగి తీసుకురావడంలో పరిమళద్రవ్యాలు సహాయపడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. మెదడులో మరుగున పడే జ్ఞాపకాలను తిరిగి పరిమళద్రవ్యాల వాసనలతో బయటకి తేవొచ్చని పిట్స్ బర్గ్‌స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధన బృందం తాజాగా ఓ అధ్యయనంలో తేల్చింది. జ్ఞాపకం తెచ్చుకోవడం కోసం తీవ్రంగా ఆలోచించేటప్పుడు మెదడు వెంటనే స్పందించాల్సి ఉంటుంది. అయితే తీవ్ర ఒత్తిడివల్ల మెదడులోని అక్కడి భాగం నియంత్రణకు గురవుతుంది. ఈ సమస్య ఉన్న కొందరికి కాఫీ గింజలు, లవంగ మొగ్గలు, నారింజ ఎసెన్షియల్ ఆయిల్ వంటివాటితో చేసిన కొన్నిరకాల పరిమళనద్రవ్యాల వాసనలను చూపించారు. దాంతో దూరమైన వారి జ్ఞాపకాలు క్రమేపీ తిరిగి రావడం మొదలయ్యాయి. చిన్న చిన్న విషయాలను కూడా ఒత్తిడి మర్చిపోయేలా చేస్తోంది. అందుకే ఉదయం ఇంటిపని మొదలుపెట్టేటప్పుడు లేదా రాత్రి నిద్రపోయే ముందు గదిని సహజసిద్ధమైన పరిమళాలతో నింపితే చాలు. జ్ఞాపకశక్తిని కాపాడుకోవచ్చు. మరిగించిన ముప్పావుకప్పు నీటిలో నాలుగు టేబుల్‌స్పూన్ల తులసి ఆకులు వేసి రెండు నిమిషాలు మరగనిచ్చి చల్లార్చాలి. దీన్ని వడకట్టి స్ప్రే సీసాలో నింపాలి. ఇందులో ముప్పావు కప్పు డిస్టిల్డ్ వాటర్, అయిదు చుక్కల నిమ్మ ఎసెన్షియల్ ఆయిల్ వేసిబాగా కలపాలి.ఈ మిశ్రమాన్ని ఇల్లంతా స్ప్రే చేస్తే చాలు. అలాగే చిన్న గిన్నె లేదా మట్టికుండలో గుప్పెడు నారింజపండు ముక్కలు ఏడెనిమిది లవంగాలు, చిన్నచిన్నగా కట్ చేసిన అయిదారు దాల్చినచెక్క ముక్కలను వేయాలి. ఇవి మునిగేలా నీటిని పోసి బాగామరిగిస్తే చాలు.ఇల్లంతా సువాసనతో నిండుతుంది. కుండీలో విరిసిన గులాబీలు నాలుగింటిని వాజ్‌లో ఉంచి భోజనబల్ల లేదా టీపాయిపై సర్దాలి. గులాబీల పరిమళం జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తూనే ఉల్లాసంగానూ ఉంచుతుంది.

# సూపర్ సిక్స్ పథకాల అమలు అసంపూర్ణం

ప్రొద్దుటూరు జూన్ 13 ప్రభాతవార్త

రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు అసంపూర్ణంగా ఉన్నాయని కానీ సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను పూర్తిగా అమలు చేశామన్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలలోని తల్లికి వందనం పథకాన్ని అమలు చేసే క్రమంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలు పూర్తి చేశామని ఒకవేళ పూర్తి చేయలేదని ఎవరైనా మాట్లాడితే వారి నాలిక మందమన్న చంద్రబాబు వ్యాఖ్యలను ఆయన ఖండించారు. సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ అమలు చేశారని నిలదీశారు. తల్లికి వందనం పథకంలో విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా 84 లక్షల మంది అర్హత గల వారు ఉండగా కానీ ప్రభుత్వం 67 లక్షల విద్యార్థుల తల్లుల ఖాతాలలో జమ చేస్తున్నట్టు చెప్పి 54 లక్షలు మంది తల్లులకు జమ చేయడం పథకాన్ని పూర్తిగా అమలు చేసినట్లా అని ప్రశ్నించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు 15వేలు చొప్పున జమ చేస్తామని చెప్పి నేడు 13వేలకే కుదించడం పథకాన్ని పూర్తి చేసినట్లా అనే నిలదీశారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ఇంతవరకు అమలు కాలేదని, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకం అర్హులందరికీ లబ్ధి చేకూరడం లేదని, ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెల 18 ఏళ్ళు నిండిన ప్రతి మహిళకు 1500 రూపాయలు పథకాన్ని ఎప్పుడు అమలు చేశారని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిది పథకాన్ని పిఫోర్ విధానానికి అనుసంధానం చేసి పథకం పూర్తి చేసాం అనడం ఇది ఎక్కడి చోద్యం అని విమర్శించారు. ఉద్యోగులకు 3వేలు భృతి ఇస్తామన్న పథకాన్ని



స్కిల్ డెవలప్మెంట్ కు అనుసంధానం చేశామని అందులో నిరుద్యోగులకు వివిధ రంగాలలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి పథకం పూర్తి చేసినట్లు ఎలా అవుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అసంపూర్ణంగా చేసి నేడు పూర్తి చేశామని ఎవరైనా చేయలేదంటే వారి నాలిక మందమని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా సమాధానం ఇచ్చారు. నిజంగా సూపర్ సిక్స్ పథకాలు చంద్రబాబు అమలు చేసి ఉంటే వైసిపి నాయకుల నాలుకలు మందమేనని కానీ సూపర్ సిక్స్ పథకాలు చంద్రబాబు అమలు చేయకపోతే ప్రజలు వివిధ రకాలుగా ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేస్తున్నా పట్టించుకోకుండా ఉండటాన్ని చర్మము మందంగా ఉన్నట్టా అని ఎద్దేవా చేశారు. ఇంకా నాలుగు సంవత్సరాలు ఒక మీ పాలన ఉందని ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చేంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల వైపు నిలబడి పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ భీమినపల్లి లక్ష్మీదేవి కౌన్సిలర్లు రాగుల శాంతి గుర్రం లావణ్య ఎంవి సుబ్బారెడ్డి అనిల్ కుమార్ వైసీపీ నాయకులు ఆంజనేయులు ఎద్దుల రాయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామాపురం తాసిల్దారుగా వెంకటేశ్వర్లు



రామాపురం జూన్ 13 ప్రభాతవార్త

రామపురం తాసిల్దార్గా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రామాంజనేయులు కలెక్టరేట్ కార్యాలయంలో సూపర్ డెంట్గా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో వీరబల్లి తాసిల్దార్గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టారు.

## తంబళ్లపల్లె ఎస్సైగా ఉమామహేశ్వర్ రెడ్డి.



తంబళ్లపల్లె జూన్ 13 ప్రభాతవార్త :

తంబళ్లపల్లె పోలీస్స్టేషన్ ఎస్ఐగా ఉమామహేశ్వర్రెడ్డి శుక్రవారం సాయంత్రం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ లోకేష్ రెడ్డి బదిలీపై చిత్తూరు వెళ్ళగా ఆస్థానంలో ఉమామహేశ్వర్ రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి తో పాటు బదిలీ ఎస్సై లోకేష్ రెడ్డిలు స్టేషన్లో పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు కాపాడటంతోపాటు నేర రహిత సమాజం కోసం పోలీసు సిబ్బంది, స్థానిక రాజకీయ నాయకులు, ప్రజలు, మహిళా పోలీసులు సహకారంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్కానిస్టేబుళ్లు నాగేశ్వరరావు, నరసింహులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పీలేరు ఎంఎంసి కార్యదర్శిగా హరినాథ్



పీలేరు జూన్ 13 ప్రభాతవార్త:

పీలేరు వ్యవసాయం మార్కెట్ కమిటీ కార్యదర్శిగా ఎం. హరినాథ్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఆయన స్థానిక ఏఎంసి కార్యాలయంలో విధుల్లో చేరారు. చిత్తూరు జిల్లా కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున హరినాథ్ పీలేరు ఏఎంసీ కి కూడా ఇన్చార్జిగా వ్యవహరించనున్నారు. వాల్మీకిపురం ఏఎంసి కార్యదర్శి కుమార్ రెడ్డి పీలేరు ఇంచార్జ్ ఏఎంసి కార్యదర్శిగా పనిచేస్తూ తిరిగి ఆయన వాల్మీకిపురం పూర్తిస్థాయి కార్యదర్శి బాధ్యతల్లో చేరారు. ఈ సందర్భంగా కొత్తగా ఇంచార్జ్ బాధ్యతలు తీసుకున్న హరినాథ్ మాట్లాడుతూ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాలు, ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి సలహాల మేరకు రైతులు, వ్యాపారులు, కార్యాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని, అలాగే రైతులకు, వ్యాపారులకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు.

## నూతన తహసిల్దార్గా క్రాంతికుమార్

లక్కిరెడ్డిపల్లి; జూన్ 13, ప్రభాతవార్త



మండల తహసీల్దార్గా ఎన్ క్రాంతి కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు రాయచోటి అన్నమయ్య జిల్లా కలెక్టరేట్లో డిప్యూటేషన్ పై సెక్షన్ లో సూపరెన్టెంట్గా పని చేస్తూ లక్కిరెడ్డిపల్లికి వచ్చారు గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీనివాసులు రాజంపేటకు బదిలీఅయ్యారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ ఎమ్మార్వో మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటు రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది నూతన తహసీల్దార్ కు పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న, హరి ప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేష్, వీఆర్వోలు కృష్ణ, పుష్ప రాజ్, వెంకోజీ, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట జూన్ 13 ప్రభాతవార్త

రాజంపేట, నందలూరు, పుల్లంపేట మండలాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడిఈ ఎం సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు మండలాల్లో ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. 33/11 కె వి రాజంపేట టౌన్, సరస్వతిపురం, తాళ్లపాక, బ్రాహ్మణపల్లి, తాళ్లపాక, ఆకేపాడు, నందలూరు సబ్ స్టేషన్స్లో 11 కె.వి ఫీడర్ కు సమీపం లో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం, మరమ్మత్తులు జరుగుతున్నందువల్ల అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగ దారులు విద్యుత్ సంస్థకు సహకరించాలని ఏడిఈ కోరారు.

## తల్లికి వందనంతో తల్లుల్లో ఆనందోత్సాహం



పెద్దమండెం జూన్ 13 ప్రభాతవార్త

తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు హామీల్లో అతి ముఖ్యమైన తల్లికి వందనం డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ కావడంతో తల్లుల్లో ఆనందం పుట్టుపడుతుంది పర్వతం ఇచ్చిన ఆరు హామీలను పూర్తి చేసుకోవడంలో సఫలమవుతుందన మండల తెలుగుదేశం యువ నాయకులు సుమన్ బీటెక్ అన్నారు శుక్రవారం తల్లుల ఖాతాల్లో ఇద్దరికీ 26,000 ముగ్గురికి 39,000 నల్గురికి 52,000 జమ కావడంతో ఇంటిల్లిపాది ఆనందాలు అవధులు దాటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15తో బస్సు ఉచిత ప్రయాణంతో ఆరు హామీలు పూర్తి చేసుకుంటుందన్నారు. ప్రజా సంక్షేమం తెలుగుదేశం పార్టీతో సాధ్యమన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ 4000 పాయలు పెన్షన్ అందిస్తుందని ఈనెల 20న రైతు భరోసాను కూడా ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి విడతలవారీగా జమ చేయడం జరుగుతుందన్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ పూర్తవతాయన్నారు. ప్రతిపక్ష నాయకులు పూట ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో ప్రజలకు మోసం చేసిందని కుట్రపూరిత వ్యాఖ్యలను ప్రభుత్వం తిప్పి కొట్టిందన్నారు. త్వరలోనే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వ గాడిపైకి తెచ్చిన తొలి అడుగు సంవత్సర అధికారిక విజయోత్సవ మును రాష్ట్రంలో కూటమి నాయకులు ఘనంగా జరుపుకున్నారు.

## అంగన్వాడీలకు ఫ్రీ స్కూల్ పుస్తకాల పంపిణీ



తంబళ్లపల్లె జూన్ 13 ప్రభాతవార్త :

తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలో ని మూడు మండలాల కు చెందిన 173 అంగన్వాడి సెంటర్లకు చిన్నారుల ఫ్రీ స్కూల్ పుస్తకాలను సిడిపిఓ సుజాత పంపిణీ చేశారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడీలో చేర్పించి ప్రీస్కూల్ ప్రాముఖ్యత, సిలబస్, పిపి వన్, పీ పీ టు బుక్స్ గురించి అవగాహన పెంచాలన్నారు. అంగన్వాడీలలో ఇప్పటికే చిన్నారుల అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టి అంగన్వాడి సెంటర్ ఉదయం 9 గం నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు రమణమ్మ, శాంతమ్మ, చంద్రకాంతమ్మ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడీని అరికట్టాలి



ఎడ్యుకేషన్ జూన్ 13 ప్రభాతవార్త

పాఠశాల విద్యార్థులకు కనీస సౌకర్యాలు అయిన మరుగుదొడ్లు క్రీడా మైదానం కల్పించడం లేదని ఫీజులు దోపిడీ పేరుతో విద్యార్థులను వారి తల్లిదండ్రులు మోసం చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విద్యాశాఖ అధికారులు స్పందించాలని కోరుతూ శుక్రవారం పిడిఎస్యు ఆధ్వర్యంలో కడప నగరంలో ఐటిఐ సర్కిల్ ప్రాంతంలో వున్నా కార్పొరేట్ పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న మాట్లాడుతూ కడప నగర పరిధిలో ఉన్న కార్పొరేట్ పాఠశాలలు రెండు బ్రాంచ్ లు కొనసాగుతున్నాయని పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా అర్హత పరీక్ష విద్యార్థులకు పెడుతున్నారని, పాఠ్య పుస్తకాలు,యూనిఫామ్ పేరుతో దోపిడీకి గురి చేస్తూ విద్యార్థులను వాళ్ళ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, కనీసం విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు,క్రీడా మైదానం అసలు లేదని ఆరోపించారు. కావున విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ జరిపి కార్పొరేట్ పాఠశాలలను ఆకస్మిక చేసి ఫీజులు దోపిడీని అరికట్టి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు జిల్లా, నగర నాయకులు మహేష్, వంశీరెడ్డి, ముబారక్ భాషా, భాస్కర్, రమణ, నవీన్, కిషోర్, సుబ్రహ్మణ్యం, కార్తీక్, రామాంజులు, నాగేంద్ర, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఎడ్యుకేషన్ జూన్ 13 ప్రభాతవార్త;

బద్వేల్ పట్టణంలో ఉన్న కళాశాల నిబంధనలకు విరుద్ధంగా కో ఎడ్యుకేషన్ కళాశాల అయితే కేవలం గర్ల్స్ కళాశాల అని ప్రచారం చేస్తూ బాలికలకు మాత్రమే తరగతులు నిర్వహించడం ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధం అని కావున ఆ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఏ.ఐ.ఎస్.బి, పి.ఎస్.యూ ఆధ్వర్యంలో కడప అర్.ఐ.ఓ వెంకట సుబ్బయ్య సమర్పించారు. ఈ సందర్భంగా ఏ.ఐ.ఎస్.బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్, పి.ఎస్.యూ జిల్లా కార్యదర్శి గోపిలు మాట్లాడుతూ. కోఎడ్యుకేషన్ అనుమతి ఉంటే కళాశాల యాజమాన్యం అందుకు భిన్నంగా గర్ల్స్ కళాశాల అంటూ ప్రచారం చేస్తూ అడ్మిషన్లు నిర్వహిస్తూ తరగతులు నిర్వహిస్తున్న కూడా ఇంటర్మీడియట్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. గతంలో కూడా ఈ కళాశాలపై ఫిర్యాదు చేసిన కూడా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే కళాశాల యాజమాన్యం యదేచ్చగా గర్ల్స్ కళాశాల అని ప్రచారం చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా గర్ల్స్కి తరగతులు నిర్వహిస్తున్న కళాశాల పై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

## పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

పీలేరు జూన్ 13 ప్రభాతవార్త :

స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని మరమ్మతులు చేయుట కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పట్టణ ఏఈ వినియోగదారులకు కోరారు రెండవ శనివారం కారణంగా ట్రీ కటింగ్ వేస్ట్ ఫీడర్ తదితర పనులు చేయడం వల్ల విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించగలరని మనవి.

## నూతన ఎస్సైగా డి.రమేష్ బాబు

రామసముద్రం జూన్ 13 ప్రభాతవార్త

మండల ఎస్సైగా శుక్రవారం డి.రమేష్ బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకుముందు రాయచోటి స్పెషల్ బ్రాంచ్ లో విధులు నిర్వహించారు. రామసముద్రం ఎస్సైగా ఉన్న రవికుమార్ రాయచోటి విఆర్కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై డి.రమేష్ బాబు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జూదం, అక్రమమద్యం, ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సాధిస్తామన్నారు. కర్ణాటక మద్యం అరికట్టడానికి మా సిబ్బంది తో కలిసి గస్తీ నిర్వహిస్తామన్నారు. పోలీస్స్టేషన్కు వచ్చే పిర్యాదులకు సమన్వయం అందిస్తానన్నారు. ఏళ్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని మీ సమస్యలు నెరవేరుస్తానన్నారు. ఎక్కడైన చట్ట వ్యతిరేక పనులు చేపడుతున్నారని తెలిస్తే వెంటనే పోలీస్ లకు ఇవ్వాలన్నారు.

## జాతీయ కుట్టు మిషన్ల దినోత్సవం వేడుకలు



పోరుమామిళ్ల రూరల్, జూన్ 13 ప్రభాతవార్త:

మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రయాన్స్ టైలరింగ్ సెంటర్ లో శుక్రవారం జాతీయ కుట్టు మిషన్ల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ టైలరింగ్ వల్ల జీవనోపాధి పొందుతున్న ప్రతి ఒక్కరికి కుట్టు మిషన్ అన్నది చాలా ముఖ్యమైన సాధనమని ఈ జాతీయ కుట్టు మిషన్ల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్క టైలర్లు కుట్టు మిషన్ ను చాలా జాగ్రత్తగా చూసుకోవాలని దాని ద్వారా మంచి జీవనోపాధిని పొందాలని ఆశించారు. టైలరింగ్ సెంటర్లో ఉన్న కాబోయే టైలర్ మహిళలందరికీ కుట్టు మిషన్ల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ కేకును కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిత్తా రోజిలీనా, ఓఎల్ఎఫ్ ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్య రాణి, ఉపాధ్యాయులు రాజారెడ్డి, డా చిత్తా అమితారెడ్డి, ఇన్స్ట్రక్టర్ పారిజాన్ ఇన్స్టిట్యూషన్ మహిళలు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి రూ.2లక్షలు విరాళం

పెండ్లిమర్రి, జూన్ 13, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలం శ్రీ కొండ గంగమ్మ ఆలయం సీజీఎఫ్ అభివృద్ధి పనులకు రూ.2లక్షలు తిమ్మారెడ్డి కుమారుడు రాజశేఖర్రెడ్డి ఆలయ ఈవో మారుతీ ప్రసాద్కు అందజేశారు. అలాగే సోమ రామ సుబ్బారెడ్డి రూ.30వేలు విరాళం అందజేవారు. ఈ మొత్తాన్ని ఈవో బ్యాంకులో జమ చేయడం జరిగింది.

## 18న తలనీలాలు, టెంకాయల వేలం పాట

పెండ్లిమర్రి, జూన్ 13, ప్రభాతవార్త:

పెండ్లిమర్ర మండలం నందిమండలం గ్రామంలో భక్తాదుల ద్వారా వచ్చే తలనీలాలు వసూలు చేసుకొని అమ్ముకునే హక్కుకు గాను మరియు టెంకాయలు అంగడి పెట్టుకొని అమ్ముకునే హక్కుకు గాను వేలం పాటను ఈనెల 18వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీ కొండ గంగమ్మ దేవస్థానం వద్ద నిర్వహిస్తున్నట్లు ఈవో మారుతీ ప్రసాద్ యాదవ్ తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొను వారు తలనీలాలకు రూ.50వేలు, టెంకాయల వేలానికి రూ.10వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

## సోలార్ వెండర్లు, వినియోగదారులకు అవగాహన సదస్సు



పెండ్లిమర్రి, జూన్ 13, ప్రభాతవార్త:

కడప ఆపరేషన్ డివిజన్ పరిదిలో పెండ్లిమర్రి సెక్షన్ ఆవరణం నందు పెండ్లిమర్రి మరియు నందిమండలం సెక్షన్కు సంబంధించి మరియు మండల పరిషత్ మీటింగ్ నందు పీఎం సూర్య ఘర్ పథకం ఉపయోగించుకొని ఇంటి పైకప్పు మీద సోలార్ రూఫ్ టాప్ అమర్చుకొనడం గురించి సోలార్ వెండర్లు, వినియోగదారులు మరియు సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఆపరేషన్ హరి సేవ్యా నాయక్ సోలార్ విద్యుత్తు వినియోగం ఆవశ్యకతను వివరించి వినియోగదారులకు చక్కటి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ వెంకటేశ్వర్లు, ఇంజినీర్, రూరల్ 2 అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు జయరామయ్య, నవనీత బాయ్, జూనియర్ ఇంజినీర్లు వెంకట శివ, రూరల్-2 సబ్ డివిజన్ సిబ్బంది, వినియోగదారులు, సోలార్ విద్యుత్తుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సమావేశం జయప్రదం చేయడం జరిగింది.

## విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి

పీలేరు జూన్ 13 ప్రభాతవార్త :



నిరసన తెలుపుతున్న ఎన్ఎస్యు ఐ నాయకులు

తల్లికి వందనం పథకం పేరుతో కూటమి ప్రభుత్వం తల్లులను మోసం చేస్తోందని అదేవిధంగా విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల. అమృత్ తేజ స్థానిక పీలేరులో ఆయన నివాసం నందు ఫ్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మద్దెల.అమృత్ తేజ మాట్లాడుతూ తల్లికి వందనం అమలు చూస్తుంటే కూటమి ప్రభుత్వం కాస్త కోతల ప్రభుత్వంగా మారిందనీ తల్లికి వందనం అమలుతో తేటతెల్లమైందన్నారు. కూటమి ప్రభుత్వ హామీలు చూస్తే కోటలు దాటాయి అమలులో మాత్రం గడపలు దాటలేకపోతున్నాయి అని ఎద్దేవాచేశారు. ఎన్నికల సమయంలో నీకు 15 వేలు నీకు 15 వేలు నీకు 15 వేలు అంటూ నాడు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టి నేడు 13వేలతో సరిపెట్టిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుంది అని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు లెక్కల వల్ల అర్హత ఉండి కూడా అర్హతను కోల్పోతున్న మిగిలిన 20 లక్షల 14 వేల 819 మంది విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఎన్.ఎస్.యూ.ఐ తరపున డిమాండ్ చేశారు. లేని పక్షంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలకు పిలుపునిస్తాము అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యూ.ఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చీకటిపల్లి.సాయి సంపత్ కుమార్,నాయకులు చందు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు

మైదుకూరు, జూన్ 13, ప్రభాతవార్త:

యోగాంధ్ర ప్రోగ్రాంలో మైదుకూరు జిల్లా పరిషత్ హై స్కూల్ స్టూడెంట్స్ డిస్ట్రిక్ట్ లెవెల్ పార్టిసిపేట్ చేసి స్టేట్కి సెలెక్ట్ అయ్యారు. కడప మున్సిపల్ కమీషనర్, డిఎస్డిఓ జగన్,ఆయుష్ మెడికల్ ఆఫీసర్ మురళి బాబు, చేతుల మీదుగా మైదుకూరు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు.యోగా క్విజ్ షాహిద్, ఐడి నెంబర్ 310525 31167 690,యోగా శ్లోకం ఆర్. లహిత్ ఐడి నెంబర్ 1306254085 7345, కళాత్మక యోగా పోటీ సి.అబ్దుల్ లతీఫ్ ఐడి నెంబర్ 1306254085 3834,పెయింటింగ్ నాగేంద్ర ఐడి నెంబర్ 13062540851343,స్కిట్ రోల్ ప్లే ఆర్. స్రుంగెదర్ ఐడి నెంబర్ 13062540856418, జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులను పలువురు అభినందించారు.



## ఉద్దిమడుగు ప్రాజెక్టు రైతుల సమస్యలు పరిష్కరించండి



సిద్ధవటం జూన్ 13 ప్రభాతవార్త

గత వైసిపి ప్రభుత్వం రైతులను పూర్తిగా అన్యాయం చేసిందని రైతు కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య రైతుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు మండలంలోని ఇరిగేషన్ శాఖ పరిధిలోని చెరువులు పునరుద్ధన, కొరక్తై, ఉద్దిమడుగు ప్రాజెక్టు క్రిం ద భూములు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని విజయవాడ మంత్రి క్యాంప్ ఆఫీస్ లో రైతులసమస్యలు పరిష్కారం పై చొరవ చూపాలని టిడిపి నేత రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య మంత్రి తీసుకెళ్లారు ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత పాలనలో ఉద్దిమడుగు ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన 100 ఎకరాలు పైబడి రైతులకు నష్టపరిహారం అందలేదని ధనవంతులకు మాత్రమే నష్ట పరిహారం అందిందని నిజమైన రైతన్నలకు అన్యాయం జరిగిందనిరైతుల కుటుంబాలకు చెందినభూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని మంత్రి దృష్టికి తీసుకున్నట్టు తెలిపారు ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న చెరువులు కుంటలు పునరుద్ధన చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు

## విమాన ప్రమాదం హృదయ విధారకం

ఎమ్మెల్యే షాజ్హాన్బాషా



ఎమ్మెల్యే షాజహాన్బాషా

మదనపల్లె, జూన్ 13 ప్రభాతవార్త :

ఏయిర్ ఇండియా విమాన ప్రమాదం హృదయ విధారకరమని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్బాషా దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన విమాన ప్రమాద బాధితులకు సంతాపం తెలిపారు. గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ నుండి లండన్ వెలుతున్న ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి గురై 240మంది ప్రయాణీకులతో పాటు 50మంది మెడికల్ కళాశాల విద్యార్థులు మృతి చెందడం భాదాకరమన్నారు. విమానం టేకాప్ అయిన కొన్ని నిమిషాలకే విమానం ప్రమాదానికి గురికావడం అందులో ప్రయాణీస్తున్న 169 మంది భారతీయులు, 53మంది బ్రిటన్ వాసులతో పాటు వైద్య కళాశాల విద్యార్థులు మృత్యువాతపడడం భాదాకరమన్నారు. మదనపల్లె నియోజకవర్గ ప్రజల తరపున మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్నాయుడు మృతుల కుటుంబాలను ఓదార్చడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విమాన ఘటనపై విచారాన్ని వ్యక్తం చేయడం జరిగిందని తెలిపారు.

## హెల్పింగ్మైండ్స్ బెంగుళూరు బస్టాండులో రక్తదాన శిబిరం

మదనపల్లె, జూన్ 13 ప్రభాతవార్త :



రక్తదానంలో పాల్గొన్న దృశ్యం

పట్టణంలోని బెంగుళూరు బస్టాండులో శుక్రవారం హెల్పింగ్మైండ్చే రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ కార్ల్లాండ్ స్టినరింగ్ జయంతిని ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా జరుపుకొంటారన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ బ్లడ్గ్రూప్ తెలుసుకోవాలని రక్తదానానికి ముందుకు రావాలని 12ఏళ్ళ కాలంలో వేలాది మందిని రక్తదాతలుగా తయారు చేసి ప్రముఖ పాత్రపోషిస్తాందన్నారు. మరిన్ని రక్తదాన శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువకుల్లో స్ఫూర్తిని నింపేలా తమ సంస్థ పనిచేస్తొందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ మొబైల్స్ గౌస్ అజాం, వాలంటీర్లు బాలచంద్ర, క్రిష్ణ, కమల, ఆనంద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కమీషనర్ను కలసిన ఏఐటియూసి నాయకులు



మదనపల్లె, జూన్ 13 ప్రభాతవార్త :

మదనపల్లె మున్సిపాలిటిలో డైలీ వేజెస్ కింద పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు 80మందికి గత ఐదు నెలలుగా పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ ఏఐటియుసి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మున్సిపల్ కమీషనర్ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలపై అనేక ఉద్యమాలు చేస్తున్నప్పటికి జిల్లా ప్రీ ఆడిటర్ నిర్లక్ష్యంగా ఐదు నెలలుగా వేతనాలు రాలేదన్నారు. దీంతో కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మున్సిపల్ కమీషనర్ స్పందించి పెండింగ్ వేతనాలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయించి తగు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కమీషనర్ స్పందిస్తూ డైలీ వేజెస్ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి షేక్ ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖ బదిలీలు

కడప జోన్లో పారదర్శకంగా నిర్వహించాలి..

కడప కార్పొరేషన్ జూన్ 13 ప్రభాతవార్త:

వైద్య ఆరోగ్య శాఖ బదిలీలు కడప జోన్లో పారదర్శకంగా నిర్వహించాలని రీజనల్ డైరెక్టర్, మెడికల్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్. రామ గిడ్డయ్యను ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, కర్నూలు జిల్లా అధ్యక్షులు వెంగల్ రెడ్డి, అనంతపురం అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి,ఏపీ యన్ జి జి వో రాష్ట్ర సహా అధ్యక్షులు వి దస్తగిరి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, మాధవ్ లు శుక్రవారం కోరారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్లో పనిచేయుచున్న ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు ప్రభుత్వం ఇచ్చిన తొమ్మిదేళ్ల మినహాయింపును.. వారు ఆఫీస్ బేరర్లుగా జాయిన్ అయినప్పటి నుండి లెక్కించాలని కోరారు. జిఏడి సర్కులర్ మెమోలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ఇందుకు సంబంధించిన కాపీల తో పాటుగా వినతి పత్రాన్ని అందించారు. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా, నిర్వహించాలని మరోమరు గుర్తు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శులు డి రవికుమార్, చంద్రమోహన్, జిల్లా నాయకులు బాలపులయ్య, హుసేన్ రెడ్డి వేణుగోపాలరెడ్డి, ప్రవీణ్, రాంమోహన్, బాషా, ప్రభాకర్ రెడ్డి, నరసింహ రెడ్డి, ర్నత్న శివరామిరెడ్డి, పద్మనాభ, వివిధ యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



ఈనెల 14న జిల్లావ్యాప్తంగా ప్రతి సచివాలయం పరిధిలో గుర్తించిన ప్రదేశాలలో

# యోగా నిర్వహించాలి

రాయచోటి జూన్ 13 ప్రభాతవార్త

ఈనెల 14న జిల్లావ్యాప్తంగా ప్రతి సచివాలయం పరిధిలో ఇప్పటికే గుర్తించిన ప్రదేశాలలో మాస్ యోగా కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్వహిస్తున్న యోగాంధ్ర 2025 మాసోత్సవాలలో భాగంగా 14న జిల్లావ్యాప్తంగా నిర్వహించాల్సిన మాస్ యోగా కార్యక్రమ నిర్వహణపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్లు ఆర్డిఓ తాసిల్దారులు ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డిఎల్డిఓలు, ఎంఈఓలు, యోగా మాస్టర్ ట్రైనర్లు, పంచాయతీ సెక్రటరీలు తదితరులతో జేసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మే 21వ తేదీ నుంచి వివిధ రకాలుగా యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు జిల్లాలో మొత్తంగా 2.25 లక్షల మందితో యోగా నిర్వహించడమే మన లక్ష్యం. ఇందుకు గ్రామ వార్డు ప్రతి సచివాలయం పరిధిలో కనీసం 9 ప్రదేశాలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని, వాటిని వెంటనే జియో టాగింగ్ చేయాలన్నారు. ఆయా ప్రదేశాలలో మరియు ప్రతి పాఠశాల, వసతి గృహాలు, కళాశాలలో 14న రెండవ శనివారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు మాస్ యోగా కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఇందుకు నేడే తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. యోగా శిక్షకులు, పాల్గొనే వారందరికీ తప్పనిసరిగా సమాచారం అందజేయాలన్నారు. తాసిల్దార్,ఎంపీడీ, పంచాయతీ సెక్రెటరీ, ఎంఈఓలు సమన్వయం చేసుకోవాలని, అలాగే పట్టణ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్లు, వార్డు సెక్రటరీలు సమన్వయం చేసుకోవాలని చెప్పారు.



సిటిజన్ ట్రైనింగ్ అటెండెన్స్ నమోదు

ఈ మెగా మాస్ యోగా కార్యక్రమంలో పాల్గొన్న పార్టిసిపెంట్స్ అందరిని క్యూఆర్ కోడ్ ద్వారా అటెండెన్స్ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. జిల్లాలో జూన్ 2 నుంచి 9 వరకు జరిగిన మొదటి దశ అటెండెన్స్ ఇంకను 58 శాతం పూర్తి చేయాల్సి ఉందని, నేడే దానిని పూర్తి చేయాలని సూచించారు. అలాగే జూన్ 3 నుంచి చేపట్టిన రెండవ దశ అటెండెన్స్ కూడా వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా మొదటి రెండు దశలలో యాప్ లో అటెండెన్స్ ఏ విధంగా నమోదు చేయాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ వీడియో కాన్ఫరెన్సో సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, డిఆర్ఓ మధుసూదన్ రావు, ఆర్డీవో శ్రీనివాస్, డిఆర్డిఏ, డ్వామా పీడీలు సత్యనారాయణ, వెంకటరత్నం, అడిషనల్ డిఎంహెచ్ఓ శైలజ, బీసీ వెల్ఫేర్ అధికారి సురేష్, సమాచార శాఖ డిపిఆర్ఓ పురుషోత్తం, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తాసిల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలలో అలరించిన రథోత్సవం

చిట్వేలి, జూన్ 13,ప్రభాతవార్త:





మండల పరిధిలోని కేఎస్ అగ్రహారం శ్రీ భూనీళా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం నందు వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి నిర్వహించిన రథోత్సవ కార్యక్రమం గొప్పగా అలరించింది. దేవేరీలతో రథంపై కొలువుదీరిన కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారిని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని రథాన్ని గ్రామ మాడవీధులలో ముందుకు లాగారు. సర్వాంతరయామైన వెంకటేశ్వరా మమ్మల్ని రక్షించాలని కోరుకున్నారు. కేఎస్ అగ్రహారం గ్రామస్తుల సహకారంతో అగ్రహారం,మార్గోపల్లి యువత చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## షేక్ సాగు భౌతిక కాయానికి నివాళులు



చిన్నమండెం, జూన్ 13 ప్రబాత వార్త :

మండలానికి చెందిన పూల వ్యాపారి షేక్ సాగు మృతి పట్ల మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తనయుడు, టిడిపి యువ నాయకుడు నిశ్చల్ నాగిరెడ్డి మృతుడి భౌతికకాయాన్ని సందర్శించి, ఘన నివాళులు అర్పించారు.

## రాయితీతో సూర్యఘర్ యోజన

దువ్వూరు, జూన్ 13, ప్రబాతవార:



విద్యుత్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కార్యక్రమం చేపట్టిందని దీనిని వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ భరణీ కృష్ణ అన్నారు. శుక్రవారం దువ్వూరులోని కళ్యాణ మండపంలో సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు, విద్యుత్ వినియోగదారులకు అవగాహణ కల్పించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందన్నారు. అలాగే బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తారన్నారు. ఈ పథకం ఎవరైనా అమర్చుకోవాలంటే ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. సోలార్ ప్లాంట్ వల్ల నెలకు విద్యుత్ బిల్లు 90శాతం తగ్గుతుందన్నారు. మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ శాఖకు అమ్మి ఆదాయం పొందవచ్చు అన్నారు. గ్రీన్ ఎనర్జీ ద్వారా పర్యావరణంకు మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీకాంత్, ఏఈలు రాజకుమార్, రామ భద్రయ్య, ఎల్‌డీఎం జనార్ధన్, నెట్‌క్యాప్ అధికారి ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా నివారణపై ర్యాలీ


దువ్వూరు, జూన్ 13, ప్రభాతవార్త:




మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామంలో జాతీయ మలేరియా నివారణ మాసోత్సవాల సంధర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సంధబ్భంగా వైద్య ఆరోగ్య శాఖ విస్తరణ అధికారి రాజగోపాల్ మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఈ నివారణకు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి చుట్టూ నీరు నిలబడ కుండా ఉండాలని అలాగే పరిశుభ్రత చర్యలు చేపట్టాలన్నారు. ఈ ర్యాలీలో వైద్య సిబ్బంది జనార్ధన్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన అడ్మిషన్లు.

చిట్వేలి, జూన్ 13, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన చిట్వేలి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. బాధ్యప్రధానోపాధ్యాయులు బి.దుర్గరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. పాఠశాలకు అనుబంధంగా బాలురకు సమీకృత వసతిగృహం, బాలికలకు ప్రత్యేకంగా మూడు వసతిగృహాలు ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు పాఠశాలలో చేరుతుంటారు. ఇప్పటివరకు పాఠశాలలో శుక్రవారం నాటికి 40 అడ్మిషన్లు జరిగినట్లు బాధ్యప్రధానోపాధ్యాయులు దుర్గరాజు తెలిపారు.

## కమిషనర్‌ను కలిసిన ఎన్జీవో ప్రతినిధులు



ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 13 ప్రభాత వార్త:

ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి కొత్తగా వచ్చిన మున్సిపల్ కమీషనర్ ను ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు కెజె రఘురామిరెడ్డి, కార్యదర్శి రామసుబ్బయ్య ఫ్లవర్ బొక్కే ఇచ్చి అభినందనలు తెలిపారు. గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగుల రెసలైజెషన్ మరియు బదిలీల ప్రకీయకు ఉత్తర్వులు ఇచ్చారని, అయితే సచివాలయ ఉద్యోగుల అభ్యతరాలను ఏపీ నాన్ గాజెట్టెడ్ గేజీట్టెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ లెటర్ హెడ్ పైన సచివాలయ ఉద్యోగులను మున్సిపాలిటీ వార్డ్ టూ వార్డ్ మరియు పంచాయతీ టూ పంచాయతీ లోనే బదిలీ చేయాలని ఉదాహరణ మున్సిపాలిటీ లో పనిచేసే టీచర్స్ మున్సిపాలిటీ లోనే బదిలీ చేస్తున్న విధంగా, అదేవిధంగా వీరికి వర్తించాలని, సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చిన తరువాత బదిలీలు చేపట్టాలని అలాగే వారికి జూనియర్ అసిస్టెంట్ స్కేల్ వర్తింపచేయాలనీ కమిషనర్ కి వినతిపత్రం అందజేశారు. అన్ని విషయాలపై సానుకూలంగా స్పందించి ఒకసారి రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల డైరెక్టర్ వారికి తెలియజేయాలని వారు తెలిపారు. ఎన్జీవో అధ్యక్షులు రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఈ విషయాలు అన్నింటి మీద జిల్లా అధ్యక్షులు ద్వారా రాష్ట్ర నాయకత్వం వరకు తీసుకొని వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైసింగ్ సెక్రటరీ ప్రభంజన్ రెడ్డి, తోల్లా కిరణ్, ప్రభాకర్ మరియు సచివాలయ ఉద్యోగులు మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.

## సిపిఐ పట్టణ కార్యదర్శిగా బాలు ఎన్నిక

గోపవరం, జూన్ 13 , ప్రభాతవార్త



బద్వేలు సిపిఐ పట్టణ కార్యదర్శిగా పెద్దలపల్లి బాలు రెండవసారి ఎన్నికయ్యారు . శుక్రవారం సిపిఐ కార్యాలయం జె.వి.భవన్ లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 11వ పట్టణ మహాసభలు జరిగాయి. ఈ మహాసభ అనంతరం పట్టణ సమితి నూతన కౌన్సిల్ 35 మంది తో ఎన్నిక జరిగింది. కార్యవర్గ సభ్యులుగా 15 మంది ఎన్నిక అయ్యారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, బద్వేల్ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్వేల్ ప్రాంతం ఇన్ చార్జి వీరశేఖర్ ల యొక్క పర్యవేక్షణలో ఈ కమిటీ ఎన్నిక జరిగింది. అనంతరం పట్టణ కార్యదర్శిగా ఎన్నికైన పెద్దలపల్లి బాలు మాట్లాడుతూ విద్యార్థి యువజన సంఘాల్లో పనిచేస్తూ నేడు పార్టీ ప్రధాన బాధ్యతలు నిర్వర్తించడం, అందునా రెండవసారి తిరిగి తనను ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన ఎన్నికకు సహకరించిన పార్టీ సభ్యులకు, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు . అదే విధంగా భవిష్యత్తులో పేదలు శ్రామికుల కోసం జరిగే అనేక పోరాటాలకు రూపకల్పన చేసి బద్వేల్ పట్టణ అభివృద్ధికి తీసుకోవాల్సిన ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

## విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు.



ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 13 ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు పట్టణం జిన్న రోడ్డు ఉర్దూ మున్సిపల్ హైస్కూల్ నందు శుక్రవారం "మన ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకుఅంజుమన్ అహలే ఇస్లాం అధ్యక్షులు ముక్తియార్, మన ప్రజా సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి అయూబ్ ఖాన్ చేతుల మీదుగా ప్రథమ బహుమతిగా అష్రఫ్ 5వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా సుహానకు 3వేల రూపాయలు, తృతీయ బహుమతి ఫరీఫా 2వేల రూపాయలు ప్రోత్సాహక బహుమతులు అందించి విద్యార్థినులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథి ముక్తియార్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు బాగా చదువుకొని ఉర్దూ స్కూల్కు మంచి పేరు తేవాలని అలాగే తల్లి తండ్రులను గౌరవించి ఉపాధ్యాయులు చెప్పిన సిలబస్ చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి అయూబ్ ఖాన్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ఖలీల్, ప్రధానోపాధ్యాయులు ఇమామ్ హుస్సేన్,విద్యా కమిటీ చైర్మన్ లాలూ, మూర్తుజా హుస్సేన్, గౌస్ లాజం,డాక్టర్ గౌస్ మొహిద్దిన్, పవన్,అలీ,యూసుఫ్, భాష ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విలీనం వద్దు మా పాఠశాలే ముద్దు..!



చాపాడు. జూన్ 13. ప్రభాతవార్త :

మోడల్ స్కూల్ పేరుతో అధికారుల్బు, కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులను విలీనం చేయవద్దని శుక్రవారం చియ్యపాడు ఎస్సీ కాలనీ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గత 50 సంవత్సరముల నుండి మా ఎస్సీ కాలనీ యందు ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులు కలరు. నేడు అదే గ్రామంలోని కొంత దూరంలో ఉన్న మోడల్ స్కూల్ కు విద్యార్థులను విలీనం చేయడంతో ప్రతినిత్యం చింతకుంట రహదారి వెంట ఇసుక ట్రాక్టర్ల లోడుతో వెళ్లే రహదారి కావడంతో మోడల్ స్కూల్ కు పంపేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే దిక్కు ఎవరని వాపోయారు. శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులు పాఠశాల దగ్గరకు వచ్చి మోడల్ స్కూల్ కి పంపాలని నచ్చజెప్పిన వినలేదు. ఐదవ తరగతి వరకు అన్ని సౌకర్యాలు ఉన్న మా పాఠశాలలోనే ఏడాది నుండి తరగతులు నిర్వహించాలని బయట స్కూలుకు పంపేది లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారుల దగ్గర వాపోయారు . పాఠశాలకు పంపకుంటే తల్లికి వందనం రాదని విద్యాశాఖ అధికారులు సూచించిన లెక్క చేయలేదు. ఐదవ తరగతి వరకు చదివే విద్యార్థులను పాఠశాలకు వెళ్లకుండా ఆపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మా పాఠశాల తరగతులను మా కాలనీలోనే ఉండేలా చొరవ తీసుకోవాలని కోరారు.

## మలేరియా మసోత్సవము



బద్వేల్ జూన్ 13 ప్రభాతవార్త :

మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పరిధిలో రాజుపాలెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం లో, టి. నరసింహా రెడ్డి సబ్ యూనిట్ ఆఫీసర్ పాల్గొని, ఈ నెలలో జరుగుతున్న మలేరియా మసోత్స వము గురించి, దోమలు అభివృద్ధి అయ్యే ప్రాంతాల గురించి, వాటి నివారణ చర్యలు గురించి, దోమ కాటు వల్ల, కలుగు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్ గునియా, మెదడు వాపు జ్వరం, పచ్చ జ్వరం, మొదలగు జ్వరాలు రాకుండా, ఉండాలంటే, ప్రజల అందరి భాగస్వామ్యం తో దోమలను అదుపు చేసి నప్పుడే దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారించ గలమని తెలియచేసారు, ప్రతి శుక్రవారం, ఫ్రైడే, డ్రైడే, కార్యక్రమం ప్రతి కుటుంబము పాటిస్తే, దోమలను, అదుపు చేయవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ, ఆరోగ్య విద్యాధి కారి, బి. వెంగయ్య మాట్లుతు పరిసరాల పరిశుభ్రతపైన,దోమలు ద్వారా వచ్చి వ్యాదుల పై ప్రజలకు ఆరోగ్య విద్య ద్వారా ప్రజలకు అవగాహన కలిపించడామైనది. ఈ కార్యక్రమం టీ. నర్సింహా రెడ్డి సబ్ యూనిట్ ఆఫీసర్, బద్వేల్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య,హెల్త్ సూపర్ వైసర్,వి. శివరామి రెడ్డి, హెల్త్ సూపెర్వైసర్, కె. వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ వి. జనార్ధన ఏ. ఎన్.యం శ్రీవాణి, నాగమణి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాధ, ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

ఒంటిమిట్ట జూన్ 13( ప్రభాతవార్త)

మండల కేంద్రమైన ఒంటిమిట్ట తాసిల్దార్ కార్యాలయంలో రెండు రోజుల కిందట తాసిల్దార్ దామోదర్ రెడ్డి నూతన బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకుడు కొమర. వెంకట నరసయ్య మరియు కార్యకర్తలు తాసిల్దార్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ కల్లుగీత డైరెక్టర్ తాసిల్దార్ తో మాట్లాడుతూ ఒంటిమిట్ట మండల గ్రామాల్లోని సమస్యలు పుట్టలు పుట్టలుగా నెలకొని ఉన్నాయని సత్వరమే పరిశీలించి పరిష్కరించాలంటూ కోరడం జరిగింది. అదేవిధంగా మండల ప్రజలకు రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండి సమస్యలపై ప్రజలు కార్యాలయానికి వచ్చిన సందర్భంలో సత్వరమే పరిష్కారం చేయాలని సిబ్బందిని ఆదేశించాలని కోరడం జరిగింది. అంతే కాకుండా మండలంలోని గ్రామాల్లో వర్గ పోరు సమస్యలు ఎక్కువగా ఉన్నాయని శాంతియుతంగా వాటిని పరిష్కరించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్లగొండ. వెంకటసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి ,ఈశ్వరయ్య, సుబ్బరాయుడు, బాల మునయ్య, తదితరులు ఉన్నారు.



## షహనాజ్‌కు డాక్టరేట్ ప్రధానం

కడప కార్పొరేషన్ జూన్ 13 ప్రభాతవార్త:



పులివెందులలో జేఎన్‌టియూ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న యన్. షహనాజ్ కు, ఇండోర్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యూనివర్సిటీ పీహెచ్‌డి డిగ్రీనీ ప్రధానం చేసింది. జెఎన్‌టియూ కళాశాలలో పనిచేస్తూనే డాక్టర్ ఏపీజే యూనివర్సిటీలో గత 6 ఏళ్లగా పిహెచ్‌డి చేస్తున్నారు. ఈ సందర్భంగా షహనాజ్ మాట్లాడుతూ కమ్యూనికేషన్స్ మరియు ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో ఫేస్ లాకింగ్ కోసం తక్కువ పవర్, తక్కువ లీకేజీ ట్రాన్సిస్టర్లను ఉపయోగించి నాలుగు రకాల అవుట్ పుట్స్ ను ఉత్పత్తి చేశానన్నారు. అనాలసిస్ అండ్ డిజైన్ ఆఫ్ ఫేస్ లాకిడ్ విత్ మల్టిపుల్ ఔట్పుట్ యూజింగ్ వి ఎల్ ఎస్ ఐ టెక్నాలజీ, పేరుతో డాక్టర్ రాహుల్ మిశ్రా పర్యవేక్షణలో పీహెచ్డీ రీసెర్చ్ ని పూర్తి చేశారు. అందుకు గాను ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ శేష మహేశ్వరమ్మ, ఈసీఈ హెచ్ ఓ డి డాక్టర్ తాజ్ మహబూబ్, తోటి అధ్యాపకులు ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ కార్యక్రమం



చిన్నమండెం జూన్ 13 ప్రభాతవార్త:

మా తండ్రి స్వర్గీయ సుగవాసి పాలకొండ్రాయుడుకు చిన్నమండెం ప్రజలన్న ఈ ప్రాంతం అన్న మా తండ్రికి ఎంతో అభిమానం, మాకు అంతే అభిమానం అని శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో పాలంద్రాయుడి కుమారుడు ప్రసాద్ బాబు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు మా కుటుంబాన్ని అభిమానించారు. ఆత్మీయంగా దగ్గరకు తీసుకున్నారు. చిన్న సమస్య వచ్చినా పెద్దా యన ఉన్నాడన్న ధైర్యంతో ఇంటి ముందరకు వచ్చిన ప్రతి ఒక్కరిని అక్కున చేర్చుకుని మీ సమస్యలను విని మీ కుటుంబ సభ్యులలో ఒకరిగా మారి వాటిని పరిష్కరించినప్పుడు అక్కడే ఉన్న నేను మీలో కలిగిన ఆనందాన్ని కళ్ళారా చూశాను. నన్ను కూడా మీ బిడ్డ లాగానే చేరదీసి ముందుకు నడిపిస్తారని విన్నవించుకుంటున్నానన్నారు. మండల కేంద్రంలో మైనారిటీలు, వైశ్యులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, రెడ్లు, బలిజలు మా తండ్రిని అభిమానించారు.. చేరదీశారు... అదే అభిమానం,,, ఆప్యాయత,,, అనురాగాన్ని నామీద కూడా చూపించాలని చేతులు చాసి అడుగుతున్నానన్నారు. ఈకార్యక్రమంలో ఏజాస్ అలీ ఖాన్, మహమ్మద్ ఖాన్, భూషణ, శంకర్, బాల, వాజిద్, సైఫుల్ల, టౌహిద్,బెల్లం కిషోర్ రెడ్డి, మంత్రి రెడ్డయ్య, కమ్మపల్లి రవి నాయుడు, సిబక్తుల్లా,పెద్దయెత్తున ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల భలోపేతమే లక్ష్యం



స్టౌవ్ పంపిణీ చేస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 13 ప్రభాతవార్త :

మదనపల్లె అర్బన్, రూరల్ మండలాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యమని శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి (సిడిపిఓ) నాగవేణి తెలిపారు. శనివారం ఐసిడిఎస్‌ప్రాజెక్టు కార్యాలయం నందు అర్బన్, రూరల్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ పిలోస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రీస్కూల్ పిల్లల నమోదు పెంచడం నాణ్యతతో కూడిన ప్రీస్కూల్ విద్యను అందించడం గురించి వివరించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోషణ గుర్తించడం, వారియొక్క పోషణ స్థితిని మెరుగుపరచడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రీస్కూల్ పిల్లలకు ప్రైమరీ పుస్తకాలు ఇవ్వడం, నాణ్యతతో కూడి విద్యను అందించడం జరుగుతుందన్నారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త సకాలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్ళి విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేంద్రాలను నడపాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండెక్షన్ స్టౌవ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

గాలివీడు, జూన్ 13(ప్రభాతవార్త):



ప్రతిరోజూ యోగా సాదన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని డీఆర్ఓ మధుసూదన్‌రావు అన్నారు. మెగా యోగా క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం, ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లా టూరిజం డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగభూషణంతో కలిసి యోగాంధ్రలో పాల్గొన్నారు. శుక్రవారం మండలంలోని వెలిగల్లు ప్రాజెక్టు పార్కులో అధికారులు, ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను నిరంతర అభ్యాసంగా నేర్చుకోవాలన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలన్నారు. అంతేగాక యోగా సాదనతో మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందని, యోగా చేయడం వల్ల ఆత్మస్థైర్యంతో రోగాలను జయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, వివిధ శాఖలకు చెందిన సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు చెక్కులు అందజేత...

ముద్దనూరు, జూన్13, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పదవ తరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం 20 వేల రూపాయల ప్రోత్సాహక నగదు చెక్కులను తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు అందించినట్లు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర నాయక్ తెలిపారు. విద్యార్థులకు నగదు బహుమతులను పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని వైష్ణవి, సుజిత, మహర్షి ఉన్నత పాఠశాల, విద్యార్థులు తేజస్, కీర్తన, సువిధ పాఠశాల విద్యార్థిని నవ్య, లకు నగదు చెక్కులను అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

